


జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేసిన అధికారులు

# నేటి నుంచి నామినేషన్ల పర్వం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నేటి నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ
- 13న పరిశీలన..15న ఉపసంహరణ.. 30న ఎన్నికలు
- డిసెంబర్ 3న ఫలితాల విడుదల

ఆసిఫాబాద్/సిర్పూర్(టీ), నవంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారం నుంచి మొదలు కానుంది. ఇందుకోసం ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లను రిటర్నింగ్ అధికారి దాసరి వేణు స్వీకరించనున్నారు. సిర్పూర్(టి) నియోజవర్గానికి సంబంధించి నామినేషన్లు సిర్పూర్(టి) మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీ స్వీకరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ హేమంత్ పర్యవేక్షిస్తున్నారు.ఈ నెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 13న నామినేషన్ల పరిశీలన, 15న అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం, 30న ఎన్నికలు నిర్వహించనున్నారు. డిసెంబర్ 3న ఎన్నికలు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 597 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. సమస్యాత్మాక పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్పీ సురేశ్‌కుమార్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లపై సర్వం సిద్ధం చేశారు.

# ఓటు హక్కు వినియోగించుకోండి

- ప్రాణహిత తీరంలో మత్స్యకారులతో కలెక్టర్ బదావత్ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్ రాంనాథ్



మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి

కోటపల్లి, నవంబర్ 2 : ఓటు వజ్రాయుదం... ప్రజాస్వామ్యానికి బాట... ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి... అని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ కోరారు. ప్రాణహిత నది దాటి వెళ్లి అక్కడ చేపలు పడుతున్న మత్స్యకారులతో మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా కోటపల్లి మండలంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు పోలింగ్ బూత్‌లను సందర్శించేందుకు గురువారం వీరితో పాటు అధికార బృందం కోటపల్లి మండలం వెంచపల్లి గ్రామానికి వచ్చారు. ప్రాణహిత వద్దకు వెళ్లి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ సమయంలో నదిలో చేపలు పడుతున్న మత్స్యకారులు కనిపించగా వారి వివరాలను ఆరా తీశారు. వేమనపల్లి మండలంలోని కల్మమలపేట నుంచి చేపలు పట్టేందుకు ప్రాణహితకు వలస వచ్చి ఇక్కడే ఉంటున్నారని తెలుసుకొని వారితో మాట్లాడేందుకు నాటు పడవ సహాయంతో నది అవతలి ఒడ్డుకు వెళ్లారు. ఈనెల 30న జరిగే ఓటింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. దీంతో వారందరూ తప్పకుండా ఓటు వేస్తామని చెప్పారు.

### విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

అధికారులు ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. కోటపల్లి మండలంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో పర్యటించిన సీపీ, కలెక్టర్, డీసీపీ ఎన్నికల నిర్వహణ, భద్రత చర్యల పై సమీక్షించారు. ఎన్నికల ప్రశాత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లను చేయాలని సూచించారు. సరిహద్దులగుండా నగదు, మద్యం, ప్రలోభాలకు గురి చేసే సామగ్రి తరలి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర వంతెన వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలి

**డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ రాణి**



మాట్లాడుతున్న స్పెషలిస్ట్ రాణి

ఆసిఫాబాద్, నవంబర్ 2: ఆడపిల్లలను తప్పనిసరిగా తల్లిదండ్రులు చదివించాలని డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ రాణి అన్నారు. మహిళా సాధికారికత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ ఆడపిల్లల అభ్యున్నతి కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న సమాజంలో ఆడపిల్లలు ఆర్థికంగా మానసికంగా ఎదగాలని, దీని కోసం తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలన్నారు. బాల్యవివాహాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడైనా అటువంటివి జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లాని సూచించారు. మహిళలకు ఎటువంటి ఆపద వచ్చినా 181కు ఫోన్ చేయాలని, చిన్న పిల్లలకు సంబంధించి ఇబ్బందులు కలిగితే హెల్ప్ లైన్ నంబర్ 1098 కు ఫోన్ చేయాలని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత అధికారి సాగర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ కు సంబంధించిన అంశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ చట్టం కల్పించిన రక్షణ వ్యవస్థ పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే వాటిని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కర్వ చతుర్థి

కౌటాల, నవంబర్ 2: మండలంలో బుధవారం రాత్రి కర్వ చతుర్థిని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. తమ భర్తలు ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేశారు. తమ మంగళ సూత్రాలను చల్లగా చూడాలని కర్వ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కర్వ మాతకు పూజలు చేస్తున్న మహిళలు

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 2: ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బెల్లంపల్లి పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో గురు వారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. రాసబత్తుల గణేశ్(హన్మాన్‌బస్తీ), ఉండ్రాల రవి (బెల్లంపల్లి బస్తీ), బర్ల స్రవంతి( కన్నాలబస్తీ) లకు కౌన్సెలింగ్ ఇచ్చి రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించినట్లు సీఐ తెలిపారు. వీరిని బెల్లంపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

### తాళ్లగురిజాల, నెన్నెల పోలీస్‌స్టేషన్ల పరిధిలో..

తాళ్ల గురిజాల, నెన్నెల పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు గురువారం బెల్లంపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజ్‌కుమార్ గౌడ్ కౌన్సెలింగ్ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని సూచించారు. సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. వీరిని బెల్లంపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. తాళ్లగురిజాల, నెన్నెల టూటౌన్ ఎస్ఐలు నరేశ్, శ్యామ్ పటేల్, రమేశ్ పాల్గొన్నారు.

### తాండూర్ పరిధిలో..

తాండూర్, నవంబర్ 2 : రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి నడుచుకోవాలని తాండూర్ సీఐ కే శ్రీనివాసరావు సూచించారు. గురువారం తాండూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో సర్కిల్ పరిధిలో ఉన్న తాండూర్, భీమిని, కన్నెపెల్లి, మాదారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలి

- నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్ రావు
- కార్మిక వాడల్లో ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న యువ నాయకుడు విజిత్ రావు

సీసీసీ నస్పూర్, నవంబర్ 2: సింగరేణి కార్మికుల సంక్షేమాభివృద్ధికి కృషి చేసిన సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అండగా నిలవాలని నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు కోరారు. నస్పూర్ మున్సిపల్ పరిధిలోని 24, 25 వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు మ్రి మొగిలి, కుర్మిళ్ల అన్నపూర్ణ ఆధ్వర్యంలో గోదావరికాలనీ(షిర్కె) సింగరేణి కార్మికుల వాడల్లో ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు కల్పిస్తున్న హక్కులు, సౌకర్యాలను కార్మిక కుటుంబాలకు వివరించారు. ఈ సందర్భంగా విజిత్‌రావు మాట్లాడుతూ సింగరేణి కార్మికులంటే సీఎం కేసీఆర్‌కు ఎంతో ప్రేమ అని.. దేశంలో ఏ పరిశ్రమల్లో లేని హక్కులను కార్మికులకు కల్పించారని వివరించారు. కారుణ్య నియామకాలు చేపట్టి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించారని, దీంతో సింగరేణి సంస్థ యువ కార్మికులతో కళకళలాడుతున్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, ఉపాధ్యక్షుడు నౌండ్ల సంతోష్, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు డీకొండ అన్నయ్య, చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బెడికె లక్ష్మి, జబీన్‌హైమద్, చిడం మహేశ్, కోడూరి లహరివిజయ్, నాయకులు పానుగంటి సత్తయ్య, బండి రమేశ్, గుంట జగ్గయ్య, కమలాకర్‌రావు, కుర్మిళ్ల మోహన్, చిట్టంపల్లి నరేశ్, ఆకుల నరేందర్, రఫీక్‌ఖాన్, జాడి భానుచందర్, అడ్లకొండ రవిగౌడ్, మేడం తిరుపతి, ఎంబడి సమ్మయ్య, పెంచాల వేణు, గుమ్మడి శ్రీనివాస్, లింగయ్య, పాల్గొన్నారు.

## భూమి రిజిస్ట్రేషన్ విషయంలో దాడి

దహెగాం, నవంబర్ 2: భూమి రిజిస్ట్రేషన్ విషయంలో ఒకరిపై ఒకరు దాడిచేసుకున్న సంఘటన గురువారం తహసీల్ కార్యాలయం లో చోటు చేసుకుంది. సిర్పూర్(టి)కి చెందిన ఫహిమాదా బేగం, సాజిదాబేగంకు లగ్గాం శివారులో 102/ఇ/A/2 సర్వేనంబర్‌లో చెరో రెండెకరాలు భూమి ఉంది. వారు ఆ భూమిని అమ్ముకున్నారు. కాగా సదరు భూమి వీలునామాగా వచ్చిందని ఆ మహిళలకు చెందిన మేనల్లుండ్లు బెజ్జూర్ మండలం కాటెపల్లికి చెందిన మస్నత్ అలీఖాన్, జిసత్ అలాఖాన్, అమీర్ అలాఖాన్, అర్బాజ్‌లాఖాన్ అభ్యంతరం తెలిపారు. ఆ భూమిని అమ్మడానికి వీలు లేదని ఆ భూమిపై కోర్టులో కేసు వేశామని వారు పేర్కొన్నారు. గురువారం ఆ భూమి రిజిస్టేషన్ ఉండడంతో భూమి అమ్ముక్కున్న ఇద్దరు మహిళలు, కొనుగోలు చేసిన వ్యక్తులు తహసీల్ కార్యాలయనికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఆ న లుగురు కూడా అక్కడికి చేరుకోవడంతో ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరుదాడి చేసుకున్నారు. అందరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కాగా, గొడవకు కారణమైన నలుగురిపై కేసు నమోదైనట్లు ఎస్ఐ సనత్ కుమార్ తెలిపారు.

# కాంగ్రెస్ మీటింగ్‌కు సీనియర్లు దూరం

నెన్నెల,నవంబర్ 2: కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ బహిరంగ సమావేశానికి నెన్నెల మండల సీనియర్ నాయకులు దూరంగా ఉన్నారు. రెండు రోజుల కిందట నందులపల్లికి వచ్చిన నాయకులు గురువారం నెన్నెలలో నిర్వహించిన సభకు హాజరు కాలేదు. వారంతా మూకుమ్మడిగా సభకు రాకుండా ఉండి పోయారు. మండల పార్టీ అధ్యక్షులు గట్టు మల్లేశ్, గుండ్లసోమారం ఎంపీటీసీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు దాగం రమేశ్, మాజి సర్పంచ్ సింగతి తిరుపతి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు జనగాం తిరుపతి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు మల్లిక , మండలానికి చెందిన పలు గ్రామాల సీనియర్ కార్యకర్తలు సభకు హాజరు కాలేదు. బీజేపీ జిల్లా నాయకులు, గొల్లపల్లి ఎంపీటీసీ హరీశ్ గౌడ్ ఇతర గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. కాగా సమాచారం లేకుండా ఎలా చేర్చుకుంటారని సీనియర్లు సమావేశానికి దూరంగా ఉన్నట్లు సమాచారం.